ప్రజాశక్తి

ఆదివారం 28 మే 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

రెజ్లర్ల పోరాటంపై..

స్పందించరేం ?



సమావేశంలో పాల్గొన్న పూజారి శైలజ, రమాప్రభ తదితరులు

- ◆లైంగిక వేధింపులకు పాల్పడ్డ బిజెపి ఎంపీని అరెస్టు చేయండి
- ◆ కేంద్రాన్ని అంతర్జాతీయ క్రీడాకారిణి పూజారి శైలజ సహా పలువురు డిమాండ్
- ◆ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం
- ◆ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆవాజ్, కెవిపిఎస్ నిరసన

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై నేటికీ కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంపై విశాఖలోని పలు క్రీడా, ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. ఢిల్లీ నడిబొడ్డున న్యాయం కోసం పోరాడుతున్న రెజ్లర్లకు మద్దతు తెలుపుతూ శనివారమూ విశాఖ నగరంలో పలు కార్యక్రమాలు జరిగాయి.

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను పదవి నుంచి తొలగించాలని, న్యాయపరమైన దర్యాప్తు నిర్వహించి అరెస్టు చేయాలని శనివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సామాజిక కార్యకర్త డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద మహిళా రెజ్లర్లు నిర్వహిస్తున్న పోరాటానికి ఈ సమావేశం మద్దతు తెలిపింది. ఈ సమావేశంలో వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో ఒలింపిక్స్‌లో రెండుసార్లు భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి, కామన్వెల్త్ గేమ్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన పూజారి శైలజ, చెస్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దండు నాగేశ్వరరావు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.రాజారావు, ఫుట్‌బాల్ కోచ్ నరేష్, కరాటే సెల్ఫ్ డిఫెన్స్ కోచ్ కె.ఇజ్రాయిల్, వైజాగ్ అడ్వెంచర్ అండ్ వాటర్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రెహమాన్, ఇంటర్నేషనల్ కబడ్డీ ప్లేయర్ జెవి.లక్ష్మి, కిక్ బాక్సింగ్ ఛాంపియన్ భవాని, ఎల్ఐసి వర్కింగ్ ఉమెన్ రాష్ట్ర కన్వీనర్ జి.సూర్యప్రభ, ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, లిటిల్ ఏంజిల్స్ స్కూల్ టీచర్ ఎస్వి.జగదాంబ, వర్కింగ్ ఉమెన్ జిల్లా కన్వీనర్ ఎం.కామేశ్వరి, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.సత్య నారాయణ, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డివైఎస్‌వై.శర్మ, మిగతా 2లో..



వినూత్నంగా నిరసన తెలుపుతున్న కెవిపిఎస్, ఆవాజ్ నాయకులు

ఎమ్మెల్యేలకు జెడ్‌పి నిధులు

'ప్రజాశక్తి' కథనంపై జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లా పరిషత్ నిధులను జెడ్‌పిటిసిలతో పాటు గ్రామీణ ప్రాంత ఎమ్మెల్యేలకూ కేటాయిస్తున్నట్లు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జె.సుభద్ర 'ప్రజాశక్తి'కి తెలిపారు. 2021-22లో జెడ్‌పిటిసిలకు రూ.15 లక్షలు చొప్పున నిధులు కేటాయించగా, గ్రామీణ ప్రాంత ఎమ్మెల్యేలకు రూ.50.90 లక్షలు చొప్పున కేటాయించినట్లు తెలిపారు. 'జెడ్‌పి నిధులపై కోల్డ్‌వార్' శీర్షికన 'ప్రజాశక్తి' టాబ్లాయిడ్ మొదటిపేజీలో శనివారం వచ్చిన కథనంపై ఆమె స్పందించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యేలకు కూడా జెడ్‌పి నిధులను రెండేళ్ల నుంచి ఇస్తున్నట్లు తెలిపారు. 2022-23లో జెడ్‌పి 15వ ఆర్థిక సంఘం నిధుల్లో జెడ్‌పిటిసి, ఎమ్మెల్యేలకు రూ.13 లక్షలు చొప్పున ఇచ్చినట్లు వివరించారు.



సాధారణ నిధుల్లో జెడ్‌పిటిసిలకు అదనంగా మరో రూ.13 లక్షలు చొప్పున అభివృద్ధి పనుల కోసం కేటాయించామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం మిగతా 2లో..

పోలీసు శాఖలో బదిలీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సిటీ విఆర్ విభాగంలో పనిచేస్తున్న ఆరుగురు ఇన్‌స్పెక్టర్లను వివిధ జోన్లకు అటాచ్ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ సిఎం.త్రివిక్రమ్ వర్మ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖపట్నం సిటీ విఆర్‌ఒగా విధులు నిర్వహిస్తున్న ఎం.శ్రీనివాసరావు, బి భాస్కరరావు, బివి.జగన్నాథ రాజులను డిసిపి (లా అండ్ ఆర్డర్) జోన్ - 1కు, జి.దేవుడు బాబు, బి.లోదర్ బాబులను డిసిపి (లా అండ్ ఆర్డర్) జోన్ - 2కు, టివి.విజయ్‌కుమార్‌ను పోలీస్ కంట్రోల్ రూమ్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. అంకితభావంతో పనిచేయాలన్నారు.

ప్రభుత్వంపై పోరాటమే శరణ్యం

▶ వార్త 2లో..

గీతంలో పిహెచ్‌డి ప్రవేశాలకు దరఖాస్తులు

▶ వార్త 3లో..

ట్రాఫిక్ నియంత్రణపై గురి

▶ వార్త 4లో..



డ్యాన్స్‌తో ఆకట్టుకున్న హీరో విజయ్ ఆంటోనీ

నగరంలో బిచ్చగాడు - 2 సందడి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తాను నటించిన బిచ్చగాడు - 2 సినిమాను విశేషంగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు 'థ్యాంక్స్' అని తమిళ హీరో విజయ్ ఆంటోనీ అన్నారు. చిత్రం విజయోత్సవంలో భాగంగా శనివారం జగదాంబ థియేటర్‌లో మేట్నీ షో విరామ సమయంలో ప్రేక్షకులతో ఆయన మాట్లాడారు. బిచ్చగాడును మించి బిచ్చగాడు -2 విజయవంతం అవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ రెండు సినిమాలూ తెలుగులో సూపర్ హిట్స్ కావడం ఆనందంగా ఉందని తెలిపారు. డిస్ట్రిబ్యూటర్స్ ప్రతినిధి సురేష్ మాట్లాడుతూ ఈ సినిమా తమిళం కన్నా తెలుగులోనే ఎక్కువ మిగతా 2లో..

ఆక్వా ఎగ్జిబిషన్.. అదరహో..

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ బీచ్ రోడ్డులోని ఎయు గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్ వాటర్ టన్నెల్ ఆక్వా ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రపంచంలోనే ఎంతో ఖరీదైన చేపలను, కనీవినీ ఎరుగని సముద్ర జీవాలను, వివిధ రంగులతో కూడిన మత్స్య సంపదను ఇక్కడ చూసి మధురానుభూతి పొందొచ్చు. ఇప్పటికే ఈ ఎగ్జిబిషన్‌కు సందర్శకులు పోటెత్తుతున్నారు. విదేశాల్లో మాత్రమే కనిపించే రేపామా హెల్ ఫిష్, హనీమూన్ ఫిష్, క్యాట్ ఫిష్, సిల్వర్ ఫిష్, గోల్డెన్ ఫిష్, ఆస్కార్ ఫిష్, కర్ఫీ ఫ్రక్ పేరన్న, జంతి, ఎస్కే గోల్డ్ ఫిష్, చికెల్డ్ ఫిష్, జీబ్రా ఫిష్, టీన్ ఫోల్ ఫిష్, జయంతి గౌరమీ ఫిష్, అరోనా ఫిష్, మోలి ఫిష్ కనువిందు చేస్తున్నాయి. చిన్నారులకు ఈ అండర్ వాటర్ టన్నెల్ ప్రదర్శన ఎంతో ఆనందాన్నిస్తోంది. ఇదే ప్రాంగణంలో జెయింట్ వీల్, పిల్లలకు హార్స్ రైడింగ్, డ్రాగన్ ట్రైన్, వంటి సెట్టింగులూ



చూడముచ్చటగా ఉన్న ఆక్వా టన్నెల్

కొలువుదీరాయి. బీచ్ రోడ్డులోని సబ్ మెరైన్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్ చెంతనే చేనేత వస్త్రాల స్టాల్స్ పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఫుడ్ కోర్టులు నోరూరిస్తున్నాయి. గృహోపకరణ వస్తువులూ అందుబాటులో ఉన్నాయి.



అరుదైన చేపలు

మొదటి పేజీ తరువాయి..

రెజ్లర్ల పోరాటంపై స్పందించరేం ?

ఎపి బాలల సంఘం కన్వీనర్ రమాప్రభ, విజ్ఞాన కేంద్రం బాధ్యులు జిఎస్.రాజేశ్వరరావు తదితరులు పాల్గొని మాట్లాడారు. లైంగిక వేధింపులకు ఒడిగట్టిన బ్రిజ్ భూషణ్ సింగ్‌కు దన్నుగా ప్రభుత్వం నిలవడంపై మండిపడ్డారు. మహిళా రెజ్లర్లు సుప్రీంకోర్టుకు పోతే తప్ప ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని తెలిపారు. దీక్షా శిబిరానికి కరెంటు, వాటర్ బంద్ చేయడం శోచనీయమన్నారు. పోలీసులే బాధితులపై భౌతికంగా దాడి చేయడం అన్యాయమన్నారు. రెజ్లర్ల పోరాటానికి అంతర్జాతీయంగా మద్దతు లభిస్తోందని అన్నారు. ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం స్పృహలోకి వచ్చి రెజ్లర్లకు న్యాయం చేయాలని కోరారు. మహిళా రెజ్లర్ల పోరాటానికి మద్దతుగా త్వరలో సంఘీభావ కార్యక్రమం చేపడతామని, మహిళా రక్షణ కోరుకునే వారంతా పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆవాజ్, కెవిపిఎస్ ఆధ్వర్యాన..

బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై నేటికీ చర్యలు తీసుకోకపోవడాన్ని ఖండిస్తూ శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆవాజ్, కెవిపిఎస్ ఆధ్వర్యంలో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.రాజు, ఆవాజ్ జిల్లా కన్వీనర్ ఎమ్‌డి ఆష్రాఫ్ మాట్లాడుతూ లైంగిక వేధింపులకు పాల్పడ్డ బిజెపి ఎంపీని జైలులో పెట్టాలన్నారు. బిజెపి ప్రభుత్వం ఒకపక్క భేటీ బచావో.. భేటీ పడావో అని నినాదం ఇస్తూ.. మరోపక్క మహిళా క్రీడాకారిణులకు రక్షణ కల్పించలేని దౌర్భాగ్య స్థితిలో ఉందని తెలిపారు. మోడీ హయాంలో మహిళలకు, దళిత, గిరిజనులకు, మైనార్టీలకు రక్షణ కరువైందని అన్నారు. ముఠా కార్మికుల సంఘం నాయకులు ఎం.సుబ్బారావు మాట్లాడుతూ ఈ నెల 28న ఢిల్లీలో జరిగే నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజానీకం పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు సంజయ్, హరి, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు టి.నూకరాజు, ఎం.ఈశ్వరరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.నర్సింగరావు, అయ్యప్ప, నాగమణి, మౌనిక, మాధవి, లక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు జెడ్‌పి నిధులు

కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులపై ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఇచ్చిన పనుల ప్రతిపాదనలకు జెడ్‌పి నిధులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఉండటంతో జెడ్‌పి సమావేశానికి హాజరుకాలేకపోయారని తెలిపారు.

నగరంలో బిచ్చగాడు - 2 సందడి

విజయవంతం కావడం విశేషమన్నారు. కథ బాగుంటే హీరో ఎవరైనా సరే సినిమా హిట్ అవుతుందని అనడానికి ఈ సినిమా ఉదాహరణ అన్నారు. కార్యక్రమంలో థియేటర్ అధినేత వి.జగదీష్, మేనేజర్ రాజు, పూర్వీ పిక్చర్స్ అధినేత నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై పోరాటమే శరణ్యం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సమస్యలు పరిష్కరించని రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటమే శరణ్యమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాష్ట్ర ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఆస్కారావు అన్నారు. శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సంఘం ఆధ్వర్యాన రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల విషయంలో సిఎం జగన్ మాట తప్పారన్నారు. ఉద్యోగుల జిపిఎఫ్ సొమ్మును దొంగిలించారని విమర్శించారు. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌పై నోరు విప్పకపోవడం బాధాకరమన్నారు. జిపిఎఫ్ ఖాతాలో సొమ్ము జమ చేయాలని, డిఎలను వెంటనే విడుదల చేయాలని, ఒకటో తారీఖునే ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని తమ సంఘం ఆధ్వర్యాన చేపట్టిన దశలవారీ ఆందోళన అక్టోబర్ 31 వరకూ కొనసాగుతుందన్నారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే నవంబర్ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్‌వి.రమణ, నగర అధ్యక్షులు కుసుమంచి కృష్ణాజీ, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

30న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సిఐటియు 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 30న ఉదయం 10 గంటలకు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీరాములు తెలిపారు. శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో డ్రైవర్లు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రాజారత్నం, సిఐటియు జిల్లా నాయకులు పాల్గొంటారన్నారు. డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు సహా పలు డిమాండ్లతో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో యూనియన్ అధ్యక్షులు సిహెచ్.శ్రీనివాస్, కమిటీ సభ్యులు శరత్, శివ, మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో రాష్ట్రం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. శనివారం ఉదయం విశాఖలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.

దొంగే దొంగ !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'దొంగే దొంగ' అన్న చందంగా జివిఎంసి పాలకవర్గం వ్యవహారం ఉంది. నగరంలో పారిశుధ్య కార్మికుల కష్టార్జితాన్ని నిలువునా 'కాంట్రాక్టర్ల' ముసుగులో దోపిడీ చేస్తున్న అధికార వైసిపి, వీరికి వత్తాసుపలికే అధికార కార్పొరేటర్ల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా ఉంది. క్లాప్ డ్రైవర్ల జీత, భత్యాలను హారతి కర్పూరంలో ఆర్పేసే విధానంతో చెలరేగిపోతున్న అధికార పార్టీపై పోరాటం నిర్వహిస్తున్న జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేత పెతకంశెట్టి వెంకటరెడ్డిపై పాశవికంగా వ్యవహరించాలనుకోవడం అత్యంత జుగుప్సాకరం. ఏడు పదుల వయసు దగ్గరపడుతున్నా వెంకటరెడ్డి కార్మికుల సమస్యలు ఎక్కడుంటే అక్కడ రక్కున వాలిపోయే మనస్తత్వంగల నేతగా పారిశుధ్య కార్మికుల హృదయాల్లో స్థానం దక్కించుకున్నారు. అలాంటి నేతపై పోలీస్ స్టేషన్‌లో చౌకబారు ఫిర్యాదులు చేయించే స్థితికి నగర పాలక సంస్థకు చెందిన కొంతమంది కాంట్రాక్టర్లు దిగడం, వారికి అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్లు కొద్దిమంది మద్దతుగా నిలవడం అత్యంత విచారకరకరం. దొంగలకు కాపుకాస్తూ శానిటేషన్ వర్కర్ల ప్రయోజనాల కోసం పనిచేసే ప్రజా నాయకులపై అడ్డగోలుగా ఆరోపణలకు దిగి ఫిర్యాదులు చేయడం చూస్తే 'దొంగే దొంగ' అన్న సామెత గుర్తుకు రాకమానదు.

సమస్యను పక్కదారి పట్టించే చర్యలు...

నగరానికి చెందిన చెత్తనంతటినీ ప్రతిరోజూ డంపింగ్ యార్డుల్లో వేసేందుకు దోహదపడుతున్న క్లాప్ డ్రైవర్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిబంధనలను గాలికొదిలేసి



వ్యవహరిస్తోంది. నెలనెలా చెత్త పన్ను కింద వసూలు చేసిన సొమ్ముల్లో క్లాప్ డ్రైవర్లకు రూ.18,500ను నెలకు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.12,500 మాత్రమే చెల్లిస్తూ పిఎఫ్, ఇఎస్ఐల సొమ్మును కాంట్రాక్టర్లు భోంచేస్తున్నారు. ప్రతి నెలా రూ.6 వేలను ఒక్కో కార్మికుడి వద్ద తినేస్తూ రూ.కోట్లకు అధిపతులౌతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్లాప్ వర్కర్లకు జారీచేసిన జివో నెంబరు 136 ప్రకారం వేతనాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్లను మేపే పనిలో జివిఎంసి నిమగ్నమైంది. జీవోకు జీవో అలా ఉంటుండగానే రాష్ట్ర ప్రభుత్వం ఆశ్రితపక్షపాతంతో కాంట్రాక్టర్లకు కొమ్ముకాయడం వెనుక సామూహిక దోపిడీ ఎంతో స్పష్టమవుతోంది. పారిశుధ్య, క్లాప్ కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలని విశాఖపట్నం లేబర్ కమీషనర్ (జెసిఎల్) 2023 ఫిబ్రవరి 20న డైరెక్షన్ ఇచ్చినా జివిఎంసి పాలకులకు పట్టడం లేదు. అమలుకు నోచుకోవడం లేదు. ఈ అంశాలపై కార్మికుల పక్షాన నిలబడి పోరాడుతున్న జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు పెతకంశెట్టి వెంకటరెడ్డిపై ఒక దళిత మహిళతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించి అరెస్టుకు పూనుకోవడం యావత్ పారిశుధ్య కార్మికవర్గంలో తీవ్ర వ్యతిరేకతకు దారితీస్తోంది. కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తూ ప్రజా నాయకులపై అక్రమ కేసులు, అరెస్టులు బనాయించే ప్రభుత్వ చర్యలపై నగర ప్రజానీకం సైతం నివ్వెరపోతున్నారు. ఇప్పటికైనా ఈ పిచ్చిచేష్టలను పాలకవర్గం మానుకోవాలన్న డిమాండ్ సర్వత్రా వినిపిస్తోంది.

ఆరోగ్య, రక్తదాన శిబిరాలకు స్పందన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ అనుప్ సత్పతి ఆధ్వర్యంలో డివిజనల్ రైల్వే హాస్పిటల్‌లో శనివారం ఉదయం నిర్వహించిన ఆరోగ్య, రక్తదాన శిబిరాలకు విశేష స్పందన లభించింది. డివిజనల్ రైల్వే ఆసుపత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.జ్యోతి సమక్షంలో శిబిరాల నిర్వహణ సాగింది. ముఖ్య అతిథిగా అనుప్ సత్పతి హాజరయ్యారు. 50 యూనిట్ల రక్తాన్ని రైల్వే ఉద్యోగులు దానం చేశారు. 200 మందికిపైగా ఉచిత ఆరోగ్య శిబిరాన్ని వినియోగించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా డిఆర్ఎం అనూప్ సత్పతి చేతుల మీదుగా సిబ్బందికి, వైద్యులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు.



రక్తదాన శిబిరంలో డిఆర్ఎం అనుప్ సత్పతి

పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎపి కాలుష్య నియంత్రణ మండలి జెసిఇ పి.ప్రసాదరావు కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఉదయం ఆయన తమ కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రీజనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు, పిసిబి ఎఇలు మూర్తి, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యాంశాల తొలగింపు దారుణం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశంలో విద్యను కాషాయీకరిస్తూ చరిత్ర, శాస్త్రీయ పాఠాలను మోడీ ప్రభుత్వం తొలగించడం దారుణమని పిడిఎస్‌ఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ అన్నారు. సంఘం ప్రచురించిన 'స్టూడెంట్' ప్రత్యేక సంచికను శనివారం మద్దిలపాలెం సమీపంలోని జన శిక్షణ సంస్థాన్‌లో ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను, జిల్లా అధ్యక్షులు పి.విశ్వనాథ్, జన శిక్షణ సంస్థాన్ ఛైర్మన్ సివి.రామరాజు పాల్గొన్నారు.

విశాఖలో 301 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జిల్లాలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలలో విధులు నిర్వహిస్తున్న 301 మంది జర్నలిస్టులకు సంబంధించి అక్రిడిటేషన్ ప్రతిపాదనలను ఆమోదించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. కలెక్టర్ ఛాంబర్‌లో శనివారం ఉదయం ఆయన అధ్యక్షతన జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులకు సంబంధించిన విషయాలను చర్చించామని తెలిపారు. త్వరలో అక్రిడిటేడ్ జర్నలిస్టులకు వైద్య శిబిరం నిర్వహించడానికి చర్యలు చేపట్టాలని వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్టు జిల్లా కో - ఆర్డినేటర్ డాక్టర్ రాజేష్‌ను ఆదేశించారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయని జర్నలిస్టులు ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి త్వరగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు కె.రాఘవేంద్రరెడ్డి, ఎన్ఎస్ఆర్‌కె.బాబురావు, ఎమ్.చిట్టిబాబు, ఎస్.అనురాధ, డి.రాణి, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.మోహనలక్ష్మి, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్టు జిల్లా కో - ఆర్డినేటర్ కెవివిఎస్ఎన్.రాజేష్, ఆర్‌టిసి డిప్యూటీ సిటిఎమ్ జి.సత్యన్నారాయణ, కన్వీనర్, మెంబరు వి.మణిరామ్ పాల్గొన్నారు.

చిన్నారులకు క్రీడల్లో శిక్షణ అవసరం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వేసవిలో చిన్నారులకు క్రీడల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా మానసిక, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించవచ్చని ట్రయాత్లాన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చెల్లుబోయిన నాగేశ్వరరావు అన్నారు. జివిఎంసి ఆధ్వర్యంలో కొద్దిరోజులుగా ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో శనివారం ఆయన పాల్గొని చిన్నారులకు క్రీడల్లో మెళకువలు నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ శిబిరంలో ఉదయం 6 నుంచి 8:30 వరకు ట్రయాత్లాన్, పిసాపోలో వంటి క్రీడల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జూన్ 5 వరకు కొనసాగే ఈ శిబిరానికి పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు హాజరు కావొచ్చని తెలిపారు. గుడ్లు, పాలు, బిస్కెట్లు వంటి పౌష్టికాహారాన్ని జివిఎంసి వారు అందజేస్తున్నారని, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ కోచ్ రామయ్య, పిసాపోలో అసోసియేషన్ కార్యదర్శి బి.రాజేష్ బాబు, కొల్లి పైడిరాజు, శార్వాణి ప్రశాంత్, గంధం మేఘన, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ చోడవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

S.O.P.No. 03 / 2025

వల్లూరు సత్యారావు వగైరాలు . . . పిటీషనర్లు

మరియు:

నిల్ . . . రెస్పాండెంటు

ప్రకటన

యిందుమూలంగా యావన్మందికి తెలియ జేయునది ఏమనగా పై నెంబరు పిటీషనర్లు మురుమళ్ల కన్యామణి, భర్త లేటు పైడిలింగంకి వారసులు అయివున్నారు. అయితే సదరు మురుమళ్ల కన్యామణి చోడవరం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో A/c No. 008220 100065280రు ఫిక్సిడ్ డిపాజిట్ చేసియుండి దర్శిలా కాలం చేసియున్నారు. సదరు డిపాజిట్ అమౌంటు వసూలు పొందే నిమిత్తం పిటీషనర్లు పేరున పై కోర్టులో సక్సేషన్ సర్టిఫికేట్ ఇప్పించ కోరి పైనెంబరు పిటీషను దాఖలు చేసి యున్నారు. సదరు పిటీషను పై కోర్టులో **తే: 16-06-2023**దీకి వాయిదా అయివున్నది. కావునా పై విషయమై ఎవ్వరికైనను ఏట్టి అభ్యంతరములు ఉన్నయెడల పై కోర్టులో పై తేదిని **ఉదయం గం. 10-30**కుకు హాజరు అయి తెలియజేయవలసినదిగా యిందు మూలంగా తెలియజేయడమైనది.

చోడవరం
తే:26-5-23

పోతల ప్రకాశరావు
అడ్వకేట్, చోడవరం

BEFORE THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION –II, AT: VISAKHAPATNAM
C.C.310/2022

Between:
Sri Budda Nagendra Rao ...Complainant

And:
The Manager,
Shriram Transport Finance Company Limited, Visakhapatnam ..Opposite Party

NOTICE

To,
Opposite Party:
The Manager,
Shriram Transport Finance Company Limited, Branch Office: Besides SankaramatamTemple, Sankaramatam Road, Visakhapatnam-530016.

The above named complainant has filed C.C.No.310/2022 against the opposite party to direct the opposite party to return the Deposit amount of Rs.5,00,000/- with interest, the date of maturity of bond for non-payment of maturity of bond amount damages for deficiency in service and for cost of litation and you are shown as opposite party to the proceedings. Please take notice that the above matter is posted to **15-06-2023** for your appearance before the Hon'ble District Consumer Disputes Redressal Commission-II, VUDA Complex, Siripuram, Visakhapatnam at **10.30 A.M.**, either yourself in person or by authorized person, failing which the Hon'ble Commission will be proceed with the matter as per law.

B. NARASINGA RAO, HABEEB SULTAN ALI & B.KAVITHA
Advocates, Visakhapatnam,
Cell : 9885355102.

ప్రజాశక్తి 3
ఆదివారం 28 మే 2023

కొత్త పైపులైన్ వేయాలి

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు కొండపేట కొండవాలు ప్రాంతంలో కొత్త పైపు లైన్ వేసి రక్షిత నీరు అందించాలని జనసేన భీమిలి నియోజకవర్గ ఇంఛార్జి డాక్టర్ పంచకర్ల సందీప్ సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. పార్టీ నియోజకవర్గ నాయకులు ఇఎన్ఎస్ చంద్రరావు, పరిమి భువనేశ్వరితో కలిసి ఆయన శనివారం తరచూ తాగునీటి సరఫరా పైపు లైన్ దెబ్బతింటున్న ప్రాంతాన్ని పరిశీలించారు. కొత్త పైపులైన్ వేసి రక్షిత నీరు అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే స్థానికులతో కలిసి ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ప్రీతం, శంకరరెడ్డి, సతీష్, వెంకట్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్న ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. దీంతో కొండపైకి నాలుగు చక్రాలు వాహనాలను అనుమతించలేదు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో అంతరాలయ దర్శనాలను ఆలయ అధికారులు నిలిపివేశారు. క్యూలైన్లు అధిక సమయం భక్తులు దర్శనం కోసం వేచి ఉండాల్సి వచ్చింది. ముఖ్యంగా ఉచిత దర్శనానికి భక్తుల సుమారు 4 నుంచి 5 గంటలపాటు క్యూ లైన్‌లో ఉండాల్సి వచ్చింది. ప్రసాదాలు, అన్నదానం కోసం అధిక సమయం పట్టింది. కొండ దిగువ సుమారు కిలోమీటర్ల పాటు ట్రాఫిక్ స్తంభించింది. గోపాలపట్నం పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

శ్రీకృష్ణ ఆలయాన్ని సందర్శించిన కారుమూరి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ, తోటగరువులో కొత్తగా నిర్మిస్తున్న శ్రీకృష్ణ ఆలయాన్ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు శనివారం సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు వారికి స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయ నిర్మాణ పనులను ఆలయ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం అభివృద్ధికి తన వంతుగా రూ.1.50 లక్షలను ఆలయ కమిటీకి అందించారు. ఆయనతోపాటు ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, గ్రామ పెద్దలు ఉన్నారు.

పార్కులను సందర్శించిన జియ్యాని శ్రీధర్

ప్రజాశక్తి -కరాస: జివిఎంసి 52వ వార్డు పరిధి శాంతినగర్, పాత కరాస తదితర ప్రాంతాల్లో ఉన్న 13 పార్కులను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ శనివారం సందర్శించారు. పార్కుల అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. పార్కులలో మొక్కలతో సుందరీకరణ పనులపై నీటి సరఫరా విభాగ అధికారులకు పలు సూచనలు చేశారు. వీలైనంత తొందరలో పార్కులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులను కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని వైసిపి సమన్వయకర్త కెకె.రాజు కోరారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులుపై శనివారం ఆయన పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి- తగరపువలస : భీమిలి మండలం పెద నాగమయ్యపాలెంలో జరిగిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. క్రికెట్ క్రీడాకారుడు సింహాద్రి స్మారక మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో ఎర్రయ్యపాలెం జట్టుపై పెదనాగమయ్యపాలెం జట్టు గెలుపొందినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎపి మత్స్యకార సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు ముఖ్య అతిథిగా పాల్గొని క్రికెట్ టోర్నమెంట్‌లో పెదనాగమయ్యపాలెం జట్టు సభ్యులకు షీల్డ్ అందజేసి అభినందించారు. విన్నర్లకు రూ.20 వేలు, రన్నర్లకు రూ.10 వేలు, మూడో స్థానంలో నిలిచిన చిన నాగమయ్యపాలెం జట్టుకు రూ.5 వేలు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఎస్ అప్పారావు, టిడిపి మండల అధ్యక్షులు డిఎఎన్.రాజు, మాజీ సర్పంచ్ గరికిన పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు నగదు బహుమతి, షీల్డ్ అందజేస్తున్న కోలా గురువులు

ఆక్రమణలను తొలగించండి : జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి -పిఎం.పాలెం : మధురవాడ పరిసర ప్రాంతాలలో ఆక్రమణలను తొలగించాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. మధురవాడ ప్రధాన రహదారులు, చంద్రంపాలెం, దుర్గా నగర్, మిథిలాపురి కాలనీ, మారికవలస, నగర పాలెం, కొమ్మాది జంక్షన్, బోయపాలెం తదితర ప్రాంతాలలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, మధురవాడ, మిథిలాపూర్ కాలనీ పరిసర ప్రాంతాలలో ఆక్రమణలు అధికంగా ఉన్నాయని, వాటిని తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. రోడ్లు, కాలువలు శుభ్రం చేసినప్పటికీ వాటి చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించడం లేదని, వెంటనే తొలగించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రధాన గెడ్డలోని పూడికలను తొలగించాలని, వర్షపు నీటికి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. వీధులలో ప్లాస్టిక్ అధికంగా కనిపిస్తోందని, వాటి నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.

జూలో పొదిగిన మొసలి గుడ్లు



మొసలి పిల్లలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో మగ్గర్ (మంచినీటి) మొసలి దాదాపు 10 నుంచి 15 గుడ్లను పెట్టిందని, ఇటీవల వాటిని విజయవంతంగా పొదగగా పిల్లలు బయటకు వచ్చినట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు. దీనికి ముందు మొసలి ఎన్‌క్లోజర్‌లోని గుడ్లు పెట్టే ప్రాంతంలో దాదాపు 10 నుంచి 15 మగ్గర్ మొసలి గుడ్ల క్లచ్ గుర్తించామన్నారు. వాటిని జూ సిబ్బంది పర్యవేక్షించి, జంతు సంరక్షకుని పరిశీలనలో గుడ్లు విజయవంతంగా పొదిగేలా చేయడానికి అవసరమైన చర్యలను తీసుకున్నామని చెప్పారు. కొన్ని వారాల తరువాత జూ సిబ్బంది, వెటర్నరీ బృందం, యానిమల్ కీపర్ గుడ్లు పొదిగే ప్రక్రియను, గూడు వాతావరణంలో ఉష్ణోగ్రత, తేమ స్థాయిలను పర్యవేక్షించినట్లు తెలిపారు. గుడ్లు పొదిగే కాలం పూర్తయిన తరువాత ఈ నెల 25న అన్ని గుడ్లు విజయవంతంగా పొదిగి పిల్లలు బయటకు వచ్చినట్టు తెలిపారు. ప్రస్తుతం అవి ఆరోగ్యంగా, చురుకుగా ఉన్నాయని వివరించారు.

డాక్టర్ అబ్దుల్‌ఖాన్‌కు అరుదైన గౌరవం

ప్రజాశక్తి - ఆరిలోవ : వైజాగ్ అపోలో వైద్యుడు డాక్టర్ అబ్దుల్ ఖాన్‌కు ఆర్థోపెడిక్స్‌లో అరుదైన గౌరవం దక్కింది. ప్రొఫెసర్ బిరుదును న్యూఢిల్లీకి చెందిన ఎహెచ్ఇఆర్ఎఫ్ ప్రదానం చేసింది. మన రాష్ట్రంలో అపోలో ఆసుపత్రికి చెందిన వైద్యుని ఈ గౌరవం లభించడం ఇదే మొదటిసారి. డాక్టర్ అబ్దుల్ ఖాన్ యుకెలో అర్థోపెడిక్ శిక్షణ పొందారు. నాలుగు పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలను సాధించారు. డాక్టర్ ఖాన్ ప్రపంచ వ్యాప్తంగా జాతీయ, అంతర్జాతీయ సమావేశాలలో 60కి పైగా మౌఖిక,



ఇ-పోస్టర్ ప్రెజెంటేషన్లు ఇచ్చారు. బ్రిటీష్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ అండ్ ఎఒ, స్విట్జర్లాండ్ సహా 14 జాతీయ, అంతర్జాతీయ వృత్తి పరమైన సంస్థలలో సభ్యునిగా ఉన్నారు. సుమారు రెండు దశాబ్దాల పాటు విదేశాలలో నైపుణ్యం సాధించి నాలుగేళ్ల క్రితం భారతదేశానికి తిరిగి వచ్చిన తరువాత మన రాష్ట్రంలో 20 అరుదైన శస్త్రచికిత్సలు కూడా చేశారు. ప్రొఫెసర్ బిరుదు పొందిన డాక్టర్ అబ్దుల్ ఖాన్‌కు అపోలో హాస్పిటల్స్ వైజాగ్ యాజమాన్యం, సిబ్బంది అభినందనలు తెలిపారు.

గీతంలో పిహెచ్‌డి ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలలో 2023-24 విద్యా సంవత్సరానికి పిహెచ్‌డి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గీతం రీసెర్చి అండ్ కన్సల్టెన్సి డైరక్టర్ ప్రొఫెసర్ రాజా ఫణిపప్పు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్, సైన్స్, ఫార్మశీ, మేనేజ్‌మెంట్, లా, సామాజిక శాస్త్ర విభాగాలలో పిహెచ్‌డి ఫుల్‌టైమ్ ప్రవేశాలకు రీసెర్చి ఎంట్రన్స్ టెస్ట్ (ఆర్‌సెట్)ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలో లభించే మార్కుల ఆధారంగా వ్యక్తిగత ఇంటర్వ్యూలను నిర్వహించి అర్హులైన వారికి ప్రవేశం కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు గీతం వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని జూన్ 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో సమర్పించాలని పేర్కొన్నారు.

ఎమ్‌వివిఎస్.మూర్తి రీసెర్చి ఫెలోషిప్

గీతం పిహెచ్‌డి ప్రవేశాలు పొందిన వారిలో ప్రతిభ గల వారిని ఎంపిక చేసి వారికి నెలకు రూ.40 వేలు చొప్పున డాక్టర్ ఎమ్‌వివిఎస్.మూర్తి ఎక్సలెన్స్ రీసెర్చి ఫెలోషిప్‌ను మూడేళ్ల పాటు అందజేస్తామని తెలిపారు.

నేరాలు ఘోరాలు

బంగారం, వెండి చోరీ

ప్రజాశక్తి- కశింకోట : మండలం, సుందరయ్య పేట పంచాయతీ పరిధి ఆనందపురం గ్రామంలో చుండూరు వెంకట రామకృష్ణ శాస్త్రి ఇంట్లో శనివారం చోరీ జరిగింది. తులంన్నర బంగారం, 50 తులాలు వెండి నగలు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. పోలీసులు కథనం ప్రకారం... వెంకట రామకృష్ణ శాస్త్రి కుటుంబం ఈ నెల 22న వేరే ఊరు వెళ్లారు. వారి బంధువైన జీఎస్పీ ప్రసాదరావు శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో వచ్చి తలుపులు తీసి చూడగా దొంగతనం జరిగినట్లు గమనించారు. వెంటనే వెంకట రామకృష్ణ శాస్త్రి కుమారుడైన వెంకట సీతారామ్మూర్తికి తెలియజేశారు. వారు వచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి మెయిన్ డోర్‌ను బద్దలు కొట్టి బెడ్ రూమ్‌లోని రెండు బీరువాలలో ఉన్న సుమారు ఒకటిన్నర తులాల బంగారం, 50 తులాల వెండి సామాన్లు, కొంత నగదు దొంగలించబడినట్లు గుర్తించారు. దీనిపై కశింకోట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చోరీ జరిగిన ఇంటిని ఎస్ఐ ఆదినారాయణరెడ్డి పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -గాజువాక : జీవీఎంసీ 65వ వార్డు పరిధి బాపూజీ కాలనీ శ్మశాన వాటికలో సుమారు రూ.18.62 లక్షల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడుతో కలిసి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల సహకారంతో గాజువాకను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ దశల వారీగా చేస్తున్నామని తెలిపారు. కొండవాలు ప్రాంతాలతో ముడిపడి ఉన్న వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఇ ఎమ్ఆర్ఎస్ అప్పారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ గోపాలరావు, సూర్యారావు, వైసిపి నాయకులు పెద్దింటి మంగునాయుడు, మద్దాల అప్పారావు, గండి అప్పలరాజు, బాబ్జి, గిరి తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు తరలించాలంటూ నిరసన

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి చిన ముసిడివాడలోని మద్యం షాపును వేరే ప్రాంతానికి తరలించాలంటూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విన్నకోట రాము ఆధ్వర్యాన శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విన్నకోట రాము మాట్లాడుతూ, మెయిన్ రోడ్డులో మద్యం దుకాణం ఉండటంతో ఉడా కాలనీ, గాంధీనగర్, అయ్యప్పనగర్ తదరితర సుమారు 10 కాలనీలకు వెళ్లే ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇక్కడ మందుబాబులు మహిళలపై అసభ్య పదజాలం వాడుతున్నారని ఆరోపించారు. రోడ్డు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయన్నారు. దీన్ని తరలించకపోతే రానున్న రోజుల్లో ఆయా కాలనీవాసులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎక్సైజ్ విభాగం ఫిర్యాదుతో ఎస్ఐ కిరణ్ అక్కడికి చేరుకొని పరిస్థితిని గమనించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి నాగభూషణ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నేడు అంబేద్కర్ జయంతి వేడుకలు

-132 కిలోల కేట్ చేయనున్న మంత్రి నాగార్జున

ప్రజాశక్తి-పెందుర్తి : డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 132వ జయంతి వేడుకలు ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు అంబేద్కర్ సేవా సమితి సభ్యులు వెంకటేశ్వర్లు తెలిపారు. దుంబారి రామారావు అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పాల్గొని 132 కిలోల కేకును కట్ చేస్తారని తెలిపారు. అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, అనకాపల్లి ఎంపీ భీసెట్టి వెంకట సత్యవతి, వైసిపి జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

అతివేగంపై జరిమానా

ప్రజాశక్తి -ఆనందపురం : వాహనాలను అతివేగంగా నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని ట్రాఫిక్ ఎస్ఐ రఘురాం పేర్కొన్నారు. అనందపురం ఫ్లైఓవర్‌పై ఇంటర్ సెప్టర్ వాహనంలోని స్పీడ్ గన్ సహాయంతో అతి వేగంగా నడిపే 159 వాహనాలను గుర్తించారు. ఆయా వాహనాలకు రూ.70,200 అపరాధ రుసుం విధించారు. కార్లు - 152, మోటార్ సైకిల్స్ - 4, ఆర్‌టిసి బస్సు - 1, ప్రైవేట్ బస్సు - 1, లారీ - 1 ఉన్నాయి. వాహనాలను వేగంగా నడిపి ప్రాణాల మీదకి తెచ్చుకోవద్దని, వేరే వారి ప్రాణాలకు కూడా హాని కలిగించవద్దని ట్రాఫిక్ ఎస్సై కోరారు. పలు చోట్ల స్పీడ్ గన్ వెహికల్స్ ఉంటాయని, వాహనదారులకు తెలియకుండానే వీటిల్లో రీడింగ్ నమోదు అయిన వెంటనే ఆయా వాహన యాజమానులకు ఆన్‌లైన్‌లో జరిమానా వెళ్తుందని తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణపై గురి

పాత గాజువాక తరహా మరో ఐదు జంక్షన్లలో మార్పులకు సిద్ధం

ప్రజాశక్తి- గాజువాక : ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పాత గాజువాక జంక్షన్‌లో రూ.50 లక్షల వ్యయంతో నూతన డిజైన్ రూపొందించారు. ఆ డిజైన్ కొంతమేర విజయవంతమైనట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గాజువాక పరిధిలోని మిగతా జంక్షన్లలో ట్రాఫిక్‌ను నియంత్రించాలనే ఉద్దేశంతో జీవీఎంసీ అధికారులు ప్రతిపాదనలు చేపట్టారు. శ్రీనగర్ జంక్షన్, జగ్గు సెంటర్, షీలానగర్ జంక్షన్, చినగంట్యాడ వంద అడుగుల రోడ్ జంక్షన్లతోపాటు వడ్లపూడి లేదా కూర్మన్నపాలెం జంక్షన్‌లో ఏదో ఒక చోట ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు శ్రీకారం చుట్టారు. మొత్తంగా ఐదు జంక్షన్లకు సంబంధించి ప్రతిపాదనలు చేశారు. గాజువాకను అనుకొని పరిశ్రమలు పెరగడంతో కార్మికులు పెరిగారు. వాహనాల సంఖ్య కూడా విపరీతంగా పెరిగాయి. దీంతో కూర్మన్నపాలెం నుంచి షీలానగర్ జంక్షన్ చేరుకోవాలంటే సిగ్నల్ పాయింట్ల వల్ల కనీసం గంట సమయం వృథా అవుతోంది. దీని దృష్టిలో పెట్టుకొని పాత గాజువాక తరహా డిజైన్ రూపొందిస్తే కొంతమేరకు ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని అధికారులు భావించారు. దీనికి సంబంధించిన ప్రాజెక్ట్ రిపోర్ట్ కూడా సిద్ధం చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. ఇవి పూర్తయితే ట్రాఫిక్ సమస్యతోపాటు ప్రమాదాల సంఖ్య కూడా తగ్గుముఖం పట్టే అవకాశముంది. దీనికి సంబంధించిన పనులు జూన్ నెలలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉందని సమాచారం.



పాత గాజువాకలో ట్రాఫిక్

రిపోర్టు తయారు చేశాం

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆదేశాల మేరకు గాజువాక నియోజకవర్గ పరిధిలో ట్రాఫిక్ ఉన్న జంక్షన్లను రిపోర్టు తయారుచేశాం. వీటిని అధికారులకు పంపాం. పాత గాజువాక తరహా డిజైన్ రూపొందించాం.

ప్రసాద్‌బాబు
ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్


ఎంఎంసికి బాపనమ్మ పార్థివ దేహాన్ని అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు, సిపిఎం నేతలు

సిపిఎం నాయకులు ప్రదీప్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి - సీతమ్మధార : సిపిఎం అక్కయ్యపాలెం జోన్ నాయకులు ప్రదీప్ కుమార్ తల్లి మండలి బాపనమ్మ శనివారం కన్నుమూశారు. ఆమె పార్థివ దేహాన్ని ఆంధ్ర మెడికల్ కాలేజీకి విద్యార్థుల పరిశోధనార్థం అప్పగించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, కృష్ణారావు, మధు, నాయినిబాబు, రమణ, సుబ్బారావు, అన్నపూర్ణ, ప్రదీప్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. బాపనమ్మ మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.


సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

జోగవానిపాలెంలో సుందరయ్య వర్ధంతి

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 67వ వార్డు పరిధి జోగవానిపాలెంలో సిపిఎం గాజువాక జోన్ కమిటీ ఆధ్వర్యాన శనివారం సాయంత్రం సుందరయ్య వర్ధంతి సభ నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ, సుందరయ్య ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.కిరీటం, కె.సంతోషం, పాలూరి లక్ష్మణస్వామి, ఎ.లోకేష్, ఇ.నర్సింగరావు పాల్గొన్నారు.

బలవంతపు చెత్తపన్ను వసూలు ఆపాలి

ప్రజాశక్తి -గాజువాక : 76వ వార్డు రామచంద్రనగర్‌లో సచివాలయ సిబ్బంది, ఆర్‌పిలు ప్రతి ఇంటికీ వెళ్లి చెత్త పన్నును బలవంతంగా వసూలు చేయడాన్ని సిపిఎం జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, డి.రమణ తీవ్రంగా ఖండించారు. స్వతంత్రనగర్, రామచంద్రనగర్‌లో డంపింగ్ యార్డు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రజలకు చెత్త పన్ను పుండు మీద కారం జరిగినట్టుగా ఉందన్నారు. విశాఖ నగరంలో ఉన్న చెత్తనంతటినీ తెచ్చి రామచంద్రనగర్ డంపింగ్ యార్డులో వేస్తున్నారని, దీని దుర్వాసనతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం చెత్త పన్ను రద్దు చేయాలని, లేకుంటే సిపిఎం పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని హెచ్చరించారు.


మహానాడు కార్యక్రమంలో పాల్గొన్న గంటా శ్రీనివాసరావు, కీర్తి

మహానాడులో టిడిపి 51వ వార్డు నాయకులు

ప్రజాశక్తి -మాధవధార : రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న తెలుగుదేశం మహానాడు కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, 51వ వార్డు టిడిపి నాయకులు సనపల కీర్తి, ఎస్సీ సెల్ నాయకులు జయరాజ్, ఉత్తర నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి చిక్కాల విజయబాబు, జిల్లా కార్యదర్శి బొడ్డేపల్లి లలిత, మహిళ నాయకులు తబల కుమారి, దవళ కుమారి పాల్గొన్నారు.

గ్రీన్‌బెల్ట్‌లో హోర్డింగ్స్ తొలగింపు

ప్రజాశక్తి-సీతమ్మధార : 4వ పట్టణ పోలీసు స్టేషన్ సమీపంలో గ్రీన్‌బెల్ట్‌లో ఏర్పాటుచేసిన హోర్డింగ్స్‌ను జివిఎంసి అధికారులు తొలగించారు. 'ఆక్రమణలపై చర్యల్లో అలసత్వం' శీర్షికన శనివారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రీన్‌బెల్ట్‌లో నిర్వహిస్తున్న ఫుడ్ కోర్టును కూడా సోమవారం నాటికి తొలగిస్తామని జీవీఎంసీ జోన్- 3 కమిషనర్ విజయలక్ష్మి తెలిపారు.

పార్లమెంటు భవనాన్ని ద్రౌపది ముర్ముచే ప్రారంభించాలి

ప్రజాశక్తి-యంత్రాంగం

ఉక్కునగరం : భారత నూతన పార్లమెంటు భవనాన్ని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతనే ప్రారంభించాలని విశాఖ స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. శనివారం అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తీర్మానం చేశారు. బోండా తౌడన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీ సభ్యులు బయ్యే మల్లయ్య, మోహన్‌బాబు పుల్లారావు, ఎస్.సత్యనారాయణ, కెవి.రత్నం, పైడి కొండలరావు, గణేష్ తదితరులు హాజరై మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి ఆదివాసి సమూహానికి చెందిన మహిళని రాష్ట్రపతిని చేశామని గొప్పలు చెప్పుకుంటున్న మోడీ ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆదివాసుల విశ్వాసాలు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, పరిరక్షిస్తామని చెప్పి నమ్మించి, సెంటిమెంటుతో ఆదివాసి ప్రాంతాల్లో 2019 పార్లమెంటు ఎన్నికల్లో ప్రచారం చేశారని, రిజర్వు స్థానాలైన 47 సీట్లలో 42 ఎంపీ స్థానాలను ఆదివాసీలు బిజెపికి ఇచ్చి గౌరవించారన్నారు. అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకులు మాత్రం ఆదివాసులకు రక్షణగా ఉన్న అటవీ హక్కుల చట్టానికి సవరణ తీసుకొచ్చి వారి నడ్డి విరిచారని విమర్శించారు. "జాతీయ ఉపాధి హామీ పథకాని"కి సవరణ తెచ్చి ఆదివాసి ప్రాంతాలలో ఈ పథకం అమలు కాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

పార్లమెంటు భవనం శంకుస్థాపనకు అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను పిలవకుండా అవమానించారని గుర్తుచేశారు. భారత ప్రథమ పౌరురాలు ద్రౌపదిముర్ము చేతనే భారత పార్లమెంటు నూతన భవనాన్ని ప్రారంభింపజేయాలని డిమాండ్‌చేశారు.

ఎంవిపి.కాలనీ : భారత నూతన పార్లమెంటు భవనాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముచే ప్రారంభింపజేయాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోరాబు సత్యనారాయణ, దినారి ప్రభాకర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఘనంగా విశ్వనాథరెడ్డి సంస్మరణ సభ


సంస్మరణ సభలో మాట్లాడుతున్న అరసం ప్రతినిధులు, కెఎస్.చలం

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ పౌర గ్రంథాలయంలో అరసం విశాఖ శాఖ ఆధ్వర్యాన ప్రఖ్యాత కథారచయిత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి సంస్మరణ సభను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు మాట్లాడుతూ, ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి తన జీవితకాలమంతా అరసం రాష్ట్ర కార్యవర్గానికి సేవలందించారని కొనియాడారు. పదేళ్లపాటు ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఉండి అరసం అభివృద్ధికి ఎంతో కృషిచేశారన్నారు. మాజీ యుపిఎస్‌సి సభ్యులు కెఎస్.చలం మాట్లాడుతూ, కేతు విశ్వనాథరెడ్డి తెలుగు కథకు ధర్మరాజు వంటివారన్నారు. ఆయన రాసిన కథలు తెలుగు కథా సాహిత్యంలో అగ్రస్థానంలో ఉంటాయని అభివర్ణించారు. కోడవటిగంటి కుటుంబరావు సాహిత్యం మొత్తం వివిధ భాగాలుగా విభజించి ఆయన ప్రచురింపజేయడం గొప్ప సాహిత్య కృషిగా భావించాలని డాక్టర్ డివి.సూర్యారావు పేర్కొన్నారు. విశ్వనాథరెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు సంపాదించి పెట్టిన కథల సంపుటిని తాను మళయాలంలోనికి అనువదించానని చెబుతూ ఆ పుస్తకాన్ని సభలో ప్రదర్శించారు. ఎల్ఆర్ స్వామి మాట్లాడుతూ, విశ్వనాథరెడ్డి గొప్ప మానవతా వాది అని తెలిపారు. అరసం అధ్యక్షులు ఎ.సీతారత్నం మాట్లాడుతూ, విద్యారంగంలో అనేక స్థాయిల్లో పనిచేసి అవసరమైన మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. ఈ సంస్మరణ సభలో అరసం ఉపాధ్యక్షులు ఎస్.హనుమంతరావు, కార్యదర్శి క్షేత్రపాలరెడ్డి, శేఖరమంత్రి ప్రభాకర్, అడపా రామకృష్ణ, శిరేల సన్యాసిరావు, కె.మధుసూదన్, ఎమ్.సుబ్బారావు, పరవస్తుసూరి పిఎ రాజు, బొట్ల అప్పారావు పాల్గొన్నారు.

గాజువాకలో నెహ్రూ వర్ధంతి

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన భారత మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని గాజువాకలో నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి కాంగ్రెస్ గాజువాక సమన్వయకర్త జెర్రిపోతుల ముత్యాలు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యరభాల భూలోక, గుడివాడ శ్రీను, ఎం.వర్మ, చక్రధరరావు, కె.అప్పారావు, ఇందల అప్పలరాజు, కొత్తపల్లి పెంటయ్య, ఇందల సోము పాల్గొన్నారు.

బంటా కాలనీలో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పరిధి బంటాకాలనీలో పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజ్, జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, జిఎంసి కో-ఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు పర్యటించారు. కాలనీలోని ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి నిధులతో బంటా కాలనీని అభివృద్ధి చేస్తానని చెప్పారు. అయోధ్య రామిరెడ్డిని ఇక్కడికి తీసుకొచ్చి కావలసిన మౌలిక వసతులను ఆయన దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గొర్ల అప్పలస్వామినాయుడు, గేదెల మురళీకృష్ణ, గునిశెట్టి శ్రీనివాసరావు, ఎతురాజుల నాగేశ్వరరావు, కంచిపాటి జగదీష్, షేక్ వలి, కార్యకర్తలు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

భారతీయ సంప్రదాయాలకు గౌరవం ఇవ్వండి

ప్రజాశక్తి-మాధవధార : నూతన పార్లమెంట్ భవనం ప్రారంభం విషయంలో భారతీయ సంప్రదాయానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విలువ ఇవ్వాలని ఏపీ స్టేట్ కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ మూల వెంకటరావు కోరారు. దేశ ప్రథమ పౌరులకు అన్నింట్లో అగ్రస్థానం ఇవ్వడం భారతీయ సంప్రదాయమని అన్నారు. హిందూ సంప్రదాయం గొప్పదని ప్రపంచమంతా చాటడం కాదని, ఆచరించడం ముఖ్యం అని పేర్కొన్నారు. భారత ప్రజల సమిష్టి ఆస్తి అయిన పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవాన్ని రాష్ట్రపతి, ప్రధాని, ఇతర విపక్ష నాయకులు కలిసి చేసినప్పుడే భారతదేశానికి ప్రపంచంలో గౌరవం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

29న చలో కలెక్టరేట్‌కు తరలిరండి

ఉపాధి హామీ కూలీలకు సిఐటియు, వ్యకాస, రైతు సంఘం నేతల పిలుపు


కూలీలతో కలిసి నినాదాలు చేస్తున్న ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు

ప్రజాశక్తి- దేవరాపల్లి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయింపు పెంచాలని, కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 29న జరగనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమానికి ఉపాధి హామీ కూలీలు, మేట్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బిటి.దొర పిలుపునిచ్చారు. శనివారం ఆయన ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశంలో టెంట్లు వేయాలని, మజ్జిగ, తాగునీరు, మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జానా సన్నిబాబు, మహిళలు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : ఈ నెల 29వ తేదీన అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ఉపాధి కూలీల ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ ఎస్.బ్రహ్మాజీ పిలుపునిచ్చారు. స్థానిక తిమ్మడు కాలువ వద్ద పనిచేస్తున్న ఉపాధి కూలీలను శనివారం ఆయన కలిసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని విమర్శించారు. కొలతలతో సంబంధం లేకుండా ప్రభుత్వం ప్రకటించిన రోజు కూలి రూ.270 ఇవ్వాలని, ప్రతి ఒక్కరికీ 200 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ, గుల్లేపల్లి, గొండుపాలెం, సింగన్నదొర పాలెం, కె.అగ్రహారం, సూరెడ్డిపాలెం గ్రామాలలో ఉపాధి హామీ పని ప్రదేశాలను శనివారం ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్రా దేముడు, ఏపి వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు గాడి ప్రసాద్ సందర్శించారు. ఉపాధి కూలీలతో సమావేశాలు నిర్వహించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకునేందుకు అందరూ ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమ్మర్ అలవెన్స్, పని ముట్లకు డబ్బులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు, మేట్లు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలో నీలకుండీలు, జానకయ్యపేట గ్రామాల్లో ఉపాధి కూలీలతో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. అప్పలరాజు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి పథకానికి ఈ సంవత్సరం కేంద్ర బడ్జెట్‌లో 30 వేల కోట్లు తగ్గించిందన్నారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో రెండు లక్షల కోట్లు నిధులు పెంచాలని, సంవత్సరానికి 200 రోజులు పని, రోజు వేతనం 600 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పే స్లిప్‌లు ఇచ్చి ప్రతివారం పేమెంట్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు ఎం.రాజేష్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.నానాజీ, నాయకులు మనబాల కొండబాబు, మనబాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.


దేవరాపల్లి మండలంలో...


కె.కోటపాడు మండలంలో...


మునగపాక మండలంలో....


కరపత్రాలు అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవానికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ పేర్కొన్నారు. స్థానిక 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకిరామరాజు ఆధ్వర్యంలో శనివారం నర్సింగరావుపేటలో జరిగిన గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి గుడివాడ అమర్నాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అమర్నాథ్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ జి.రామ్మూర్తి, రత్నకుమారి, జీవీఎంసీ జోనల్ కమిషనర్ వెంకటరమణ, అప్పారావు, గొన్నాబత్తుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రోజారాణి

గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి- కశింకోట

గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి రోజారాణి అన్నారు. మండలంలోని గొబ్బూరు, జె తుని గ్రామాలను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గొబ్బూరులో జరుగుతున్న ఇల్లు నిర్మాణం, అంగన్వాడీ, చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. సచివాలయం సిబ్బందితో పలు అంశాలపై చర్చించారు. అనంతరం జెడ్ తునిలో పలు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కొంకి అప్పారావు, సర్పంచ్‌లు కోన అరుణ, మళ్ల మణి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, ఎపిఎమ్ శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి- కశింకోట

కశింకోట మండల పరిషత్ కార్యాలయంలో విశాఖ జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ డి సత్యనారాయణ శనివారం అకస్మాత్తుగా తనిఖీలు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. వివిధ శాఖలకు సంబంధించిన వివరాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌పిడిఒ కొంకి అప్పారావు, సూపరింటెండెంట్ ఖాన్, సిబ్బంది గణేష్ పాల్గొన్నారు.


రికార్డులు తనిఖీ చేస్తున్న జెడ్‌పి డిప్యూటీ సిఇఒ సత్యనారాయణ

యాంత్రీకరణతో వ్యవసాయాభివృద్ధి

ప్రజాశక్తి- సబ్బవరం

యాంత్రీకరణ తోనే వ్యవసాయాభివృద్ధి సాధ్యం అవుతుందని స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. మండల వ్యవసాయ కార్యాలయంలో గుల్లేపల్లి, వంగలి గ్రామాల కస్టమ్ హైరింగ్ సెంటర్‌లకు చెందిన శ్రీనివాస్, సిహెచ్‌సి సోమలింగేశ్వర్, సిహెచ్‌సి గ్రూపులకు ప్రభుత్వం సబ్సిడీతో రెండు ట్రాక్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.2 లక్షలు సబ్సిడీ ఇచ్చినట్లు చెప్పారు. యాంత్రీకరణను ప్రోత్సహించడంలో భాగంగా మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాలకు 17 కస్టం హైరింగ్ సెంటర్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్కొక్క సిహెచ్‌సికు రూ.15 లక్షల విలువ గల వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. దీనిలో 40శాతం వరకూ రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, జెడ్‌పి వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, కోటాన రాము, సబ్బవరపు ముత్యాల నాయుడు, సబ్బవరపు నారాయణ మూర్తి, వంగలి ఎంపీటీసీ గవర తులసి రాజు, యడ్ల నాయుడు, కోటాన వెంకట రమణ, వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ, ఎఈఓ బాలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ఆటోమేటిక్ పవర్ సప్లై ఆఫ్ యంత్రం రూపకల్పన

ప్రజాశక్తి-అనకాపల్లి

హైఓల్టేజ్ వచ్చినా, ఇంటిలో షార్ట్ సర్క్యూట్ అయినా ఆటోమేటిక్‌గా పవర్ సప్లై ఆఫ్ అయ్యేలా యంత్రాన్ని అనకాపల్లి దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల 3వ సంవత్సరం డిప్లొమా ఈఈఈ విద్యార్థులు రూపొందించారు. ఎం.హేమలత గైడెన్స్‌లో విద్యార్థులు.డి.జశ్వంత్ కుమార్, ఎ.పుష్ప రాజు, జి.దేవీ ప్రసాద్ దీనిని తయారు చేశారు. హైఓల్టేజ్ వచ్చినా ఈ పరికరాన్ని ఉపయోగించి ఇంట్లో ఉండే గృహోపకరణాలు (టివి, ఫ్రిజ్, ఎసి) మరమ్మతులకు గురికాకుండా కాపాడుకోవచ్చని దీనిని రూపొందించిన విద్యార్థులు తెలిపారు. ఈ పరికరం తయారు చేయడానికి కేవలం రూ.500 ఖర్చు చేసినట్లు ప్రాజెక్ట్ ఇంజినీర్ బి.శేషగిరిరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ రత్నాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ చెల్లా నరసింహం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, హెచ్ఒడి డాక్టర్ గోపాలమ్మ అభినందించారు.


ఆటోమేటిక్ పవర్ సప్లై ఆఫ్ యంత్రాన్ని రూపొందించిన విద్యార్థులు

గ్రామ వాలంటీర్లకు సత్కారం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాలంటీర్లను సత్కరించి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ వాలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కరోనా లాంటి సమయంలో వాలంటీర్లు ప్రాణాలకు తెగించి సేవలు అందించారన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు వాలంటీర్లు వారధులుగా నిలుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సువర్ణ రాజు, వైసీపీ నేతలు గేదెల సత్యనారాయణ, కె.అచ్చం నాయుడు తదితరులు పాల్గొన్నారు.


వాలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

సమస్యలపై ఉద్యోగుల రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి- సబ్బవరం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ప్రభుత్వం ఉద్యోగులు ఒక్కరోజు రిలే నిరాహార దీక్షను శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని, ప్రతి నెల 1వ తేదీన జీతభత్యాలు చెల్లించేలా చట్టం చేయాలని కోరారు. 1993 నవంబర్ 25 కంటే ముందు నియమితులైన ఎన్ఎమ్ఆర్, డైలీవేజ్, కంటింజెంట్ ఉద్యోగులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలన్నారు. అన్ని శాఖలలో డిఎస్‌సి ద్వారా నియమితులైన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మెరుగైన జీతాలు (సమాన పనికి సమాన వేతనం) ఇవ్వాలని డిమాండ్ చేశారు. 11వ పిఆర్‌సి అమలులో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలలో భాగంగా ఆర్థికపరమైన బకాయిలను, డిఎ, ఎరియర్స్‌ను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఉద్యోగులు దాచుకున్న సొమ్ములకు భద్రత కల్పించాలన్నారు. ఉద్యోగులు రిటైర్మెంట్ రోజునే అన్ని ఆర్థిక ప్రయోజనాలను విడుదల చేయాలని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశపరచి సమస్యలు చర్చించి, పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇంకా 200 డిమాండ్ల సాధనకై ఉద్యమ కార్యాచరణ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ షేక్ బాబురావు, ఎఒ పోతల సత్యనారాయణ, పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



ఒక రోజు నిరాహార దీక్ష చేస్తున్న వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు



చనిపోయిన మేకలు వద్ద రోదిస్తున్న అప్పలరాజు

గడ్డి మందు నీళ్లు తాగి 16 మేకలు మృతి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని జగన్నపేట వద్ద గడ్డి మందు కలిపిన నీళ్లను నరేంద్రపురం గ్రామానికి చెందిన దూలి అప్పలరాజు చెందిన 16 మేకలు శనివారం మధ్యాహ్నం తాగి మృతి చెందాయి. అప్పలరాజు 75 మేకలను తీసుకొని మేపడానికి నరేంద్రపురం మీదుగా జగన్నపేట పంట పొలాలకు చేరుకున్నాడు. జగన్నపేట గ్రామానికి చెందిన రైతు తన వ్యవసాయానికి క్రిమిసంహారక మందు పిచికారి చేయడానికి గడ్డి మందు బకెట్లో నీరు పోసి గట్టుపై ఉంచాడు. అది తెలియని మేకలు ఆ నీటి తాగడంతో 16 మేకలు ఒకసారిగా చనిపోయాయి. దీంతో అప్పలరాజుకు రూ.2 లక్షల మేరకు నష్టం వాటిల్లింది. మేకలు మృత్యువాత పడడంతో అప్పలరాజు, ఆయన భార్య లబోదిబోమంటున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

నెహ్రూకు ఘన నివాళి

ప్రజాశక్తి- అనకాపల్లి

దేశ ప్రథమ ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 59వ వర్ధంతి కార్యక్రమం అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేసి పూలమాలతో నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అనకాపల్లి నియోజకవర్గం కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు ఐఆర్.గంగాధర్ మాట్లాడుతూ దేశాన్ని పునాదుల నుండి నిర్మించి దేశానికి దిశా నిర్దేశం చేసిన మహా నేత పండిట్ నెహ్రూ అని కొనియాడారు. కాంగ్రెస్ నాయకులు దాసరి సంతోష్ మాట్లాడుతూ నెహ్రూ కలలుగన్న దేశాన్ని నేడు మతోన్మాదులు కబళించి విచ్ఛిన్నం చేస్తున్నారని ఆరోపించారు. నెహ్రూ ఆశయాల సాధనకు యువత నడుంబిగించాలని బుద్ద కిషోర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు టి.సంతోష్ గౌడ్, పిల్లి నానిగౌడ్, మందా రాజు మాదిగ, పొన్నా సుధాకర్, ఉల్లింగల సంతోష్, పిల్లి త్రినాథ్ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి- అనకాపల్లి

పతంజలి యోగ సమితి భారత స్వాభిమాన ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు భీశెట్టి దొరమానాయుడు ఆధ్వర్యంలో జార్జి క్లబ్ యోగ ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా శనివారం అందరికీ ఆరోగ్యం యోగతోనే సాధ్యం పేరుతో ఎన్టీఆర్ గ్రౌండ్లో చైతన్య ర్యాలీ నిర్వహించారు. అనంతరం నెహ్రూ చౌక్ జంక్షన్‌లో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ గండి వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం దేహభక్తి, దేశభక్తి ఉన్నవారికి మాత్రమే సొంతమన్నారు. ఈ కార్యక్రమంలో పెంటకోట సుబ్రహ్మణ్యం, మళ్ల నరసింగరావు, అధ్యక్షులు కొలపర్తి కన్నబాబు, కార్యదర్శి భీమరిశెట్టి శ్రీనివాసరావు, ఆడారి చిన్న వీరు నాయుడు పలు యోగా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని గొట్టివాడ పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శనివారం ప్రారంభించారు. రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం మొదట అంతస్తు భవనాన్ని, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.14.95 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని, రూ.20.15 లక్షలు నాడు-నేడు నిధులతో నిర్మించిన పాఠశాల భవనాన్ని, రూ.7.90 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సాలాపు మీనా, ఎంపీపీ బోకం సూర్య కుమారి రామునాయుడు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైసిపి నాయకులు కోటాన రాము, సాలాపు వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాల నాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి, విరోతి అప్పల నాయుడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ పాల్గొన్నారు.

స్నేహపూర్వకంగా ఉండాలి

ముదుర్తి, ఎం.కొత్తపల్లి గ్రామాల పెద్దలకు డిఎస్‌పి హితవు



ఇరు గ్రామాల పెద్దలతో సమావేశమైన డిఎస్‌పి సుబ్బరాజు

ప్రజాశక్తి-చోడవరం

ముదుర్తి, ఎం.కొత్తపల్లి గ్రామాల మధ్య సామరస్య, స్నేహపూరిత వాతావరణం కల్పించాలని అనకాపల్లి డిఎస్‌పి ఆ సుబ్బరాజు ఆయా గ్రామాల పెద్దలను కోరారు. మండలంలోని ముదుర్తి, ఎం.కొత్తపల్లి గ్రామాల మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో ఇరు గ్రామాల ప్రజల మధ్య స్నేహ పూరిత వాతావరణం కలిగించడానికి డిఎస్‌పి చోడవరం పోలీస్ స్టేషన్‌లో శనివారం ఇరు గ్రామాల పెద్దలతో సమావేశం నిర్వహించారు. సాంస్కృతి కార్యక్రమాలు జరిగినప్పుడు, శుభకార్యాలు, రాజకీయ మీటింగులు ఏర్పాటు చేసినప్పుడు తరుచూ గొడవలకు దిగడం మంచిది కాదని, దీని వల్ల యువత భవిష్యత్తు నాశనమవుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో కక్షలు పెరిగి విపత్కర సంఘటనలకు దారి తీయవచ్చునని తెలిపారు. ఇరు గ్రామాల ప్రజలు స్నేహపూర్వకంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిఐ శ్రీనివాసరావు, ప్రజా ప్రతినిధులు, పెద్దలు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు

చోడవరం : ముదుర్తి గ్రామానికి చెందిన గ్రామ వాలంటీర్ గేదెల కుమార్‌పై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక సిఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. వాలంటీర్ గేదెల కుమార్ శనివారం ఆటోలో అనకాపల్లి వెళ్తున్నాడు. ఎం.కొత్తపల్లి గ్రామానికి చెందిన నంబారు ఈశ్వరరావు ఇంటి ముందుగా ఆటో వెళ తుండగా ఈశ్వరరావుతో పాటు ఆయన కుటుంబ సభ్యులు మురుగుద్ది రాజు, మైదాన గణేష్ కుమార్‌ను అడ్డుకొని కొట్టడమే కాకుండా అతనిపై బ్లేడ్‌తో దాడి చేశారని, కొత్తపల్లి గ్రామానికి వస్తే చంపుతామని బెదిరించారని బాధితుడు ఫిర్యాదు చేసినట్లు సిఐ తెలిపారు.



జెండా ఊపి ప్రారంభిస్తున్న టిడిపి పరవాడ మండల అధ్యక్షులు

మహానాడుకు తరలిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి


రాజమండ్రిలో నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ మహానాడుకు అనకాపల్లి జిల్లా, పట్టణానికి చెందిన టిడిపి నాయకులు శనివారం తరలి వెళ్లారు. రాజమండ్రి వెళ్లిన వారిలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, మాజీ ఎమ్మెల్సీలు పప్పల చలపతిరావు, బుద్ధ నాగ జగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, పట్టణ నాయకులు మళ్ల సురేంద్ర, పోలవరపు త్రినాథ్, బొద్దపు ప్రసాద్, సబ్బవరపు గణేష్, యల్లంకి సత్తిబాబు, పిట్ల రాజు, దాడి జగన్, ఆకుల నానాజీ, తిప్పన అప్పారావు, పూడి త్రినాథరావు, ఎర్రంశెట్టి కార్తీక్, మళ్ళ సూరిబాబు, వేగి కృష్ణ, కర్రి నాయుడు, పెంటకోట శ్రీను, జొన్నాడ సురేష్, ఎస్.భానుచందర్ ఉన్నారు.

పరవాడ : టిడిపి మహానాడుకు పరవాడ మండలం నుంచి టిడిపి నాయకులు మాజీ ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు, పార్టీ నాయకులు వియ్యపు చిన్నా, బొండా తాతారావు, సారిపల్లి జోగి నాయుడు, కలిదిండి రామకృష్ణంరాజు, కూండ్రపు శ్రీనివాస్, పైల వరలక్ష్మి, పైలా అప్పల నాయుడు, పైలా కుమార్, జాజుల చిన్నారావు, గుండా వెంకటేష్, శివలంక గౌతమ్, ముప్పల సింహాచలం, నంబారి రమణ, గొరుసు అప్పలరాజు, మొల్లి బాలాజీ తరలివెళ్లారు.

మత్స్యకార ప్రమాద బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి-అచ్యుతాపురం

పూడిమడక గ్రామానికి చెందిన ఎరిపల్లి మణికుమార్ కుటుంబానికి మత్స్యకార ప్రమాద బీమా కింద మంజూరైన రూ.5 లక్షల చెక్కును శనివారం ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు అందజేశారు. పూడిమడక గ్రామానికి చెందిన మణికుమార్ చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకార ప్రమాద బీమా పథకం ద్వారా రూ.ఐదు లక్షలు ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార వర్మ, గ్రామ సర్పంచ్ చేపల సుహాసిని, మాజీ సర్పంచ్ చేపల వెంకటరమణ, వైసిపి మండల అధ్యక్షులు దేశంశెట్టి శంకర్రావు, పార్టీ సీనియర్ నాయకుడు కోన బుజ్జి, మత్స్యకార నాయకుడు కొవిరి శ్రీను, ఎంపిటిసి సభ్యుడు శనివాడ జువాల నాయుడు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

'ఫ్యామిలీ ఫిజీషియన్'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు శబ్బం అన్నారు. మండలంలోని బట్లపూడి గ్రామంలో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించి సుమారు 50 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శబ్బం మాట్లాడుతూ ప్రతినెలా ప్రతి గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఎస్ ఎం మనియమ్మ, ఎంఎల్‌హెచ్‌పి ఆర్ సత్యవతి, ఏఎన్ఎం సిహెచ్ ఆదిలక్ష్మి, ఎంపి హెచ్ఎ ఎన్ రాము, డీఈఓ గౌతమి, ఆశ వర్కర్లు లక్ష్మి, జి నాగమణి పాల్గొన్నారు.



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్

ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, కీర్తిశేషులు నందమూరి తారక రామారావు 100వ జయంతి వేడుకలను ఈనెల 28 నుండి ప్రతి గ్రామం, మండల, పట్టణ కేంద్రాలు, వార్డుల్లో ఘనంగా నిర్వహించాలని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాలను వాట్సాప్, ఫేస్ బుక్, ట్విట్టర్ ఇలా అన్నింటిలోనూ విస్తృత ప్రచారం చేయాలని కోరారు. పార్టీ శ్రేణులు, టిడిపి అనుబంధ సంఘాలు, బాలకృష్ణ, ఎన్టీఆర్ ఫ్యాన్స్, పార్టీ సానుభూతిపరులు వీటిల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జగనన్న కాలనీల పరిశీలన

ప్రజాశక్తి- అనకాపల్లి:మండలంలోని బగులవాడ గ్రామంలో జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులను శనివారం ఆర్డీవో చిన్నికృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా అర్హులైన ఇల్లు లేని పేదవారు ఉంటే స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలని, మంజూరైన వారు తక్షణమే ఇల్లు నిర్మించుకోవాలని కోరారు. ఆయన వెంట తహశీల్దారు గంగాధర్‌రావు, ఎంపీడీవో ధర్మారావు, ఆర్ఐ రమేష్, వైసిపి గ్రామ అధ్యక్షులు మజ్జి వెంకటప్పారావు, హౌసింగ్ శాఖ సిబ్బంది ఉన్నారు.

మునగపాక రూరల్ : త్వరితగతిన ఇళ్ళ నిర్మాణాలు చేపట్టాలని డిఎల్‌డిఒ మంజులవాణి కోరారు. హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని నాగులపల్లి గ్రామంలోని జగనన్న లేఅవుట్‌ను ఆమె సందర్శించారు. లబ్ధిదారులతో సమావేశం జరిపారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణాల జాప్యంలో గల సమస్యలను సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, డిటి వినయ్ కుమార్, ఈఓపిఆర్‌డి పి.ఈశ్వరరావు, సచివాలయ సిబ్బంది, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని న్యాయంపూడి లో జగనన్న లే అవుట్‌ను శనివారం ఎంపీడీవో సీతారామరాజు, ఈఓపిఆర్‌డి వెంకటనారాయణ, పలువురు అధికారులు సందర్శించారు. గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. ఎంపీడీవో సీతారామరాజు లబ్ధిదారులతో మాట్లాడారు. వేగవంతంగా గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు.లబ్ధిదారులకు పేమెంట్లు సకాలంలో అదే విధంగా చూడాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. జగనన్న కాలనీలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న అధికారులు

పోషకాహారం అందించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:చిన్నారులకు మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. శనివారం నక్కపల్లిలో అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులను పరిశీలించారు. చిన్నారులతో ముచ్చటించారు. చిన్నారులకు పరిశుభ్రమైన వాతావరణంలో శుచికరమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. గర్భిణీలకు, బాలింతలకు సకాలంలో పోషకాహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి వెంకటనారాయణ, ఐసిడిఎస్ పిఓ శ్రీవిద్య, సూపర్వైజర్లు హైమావతి, సత్యవతి, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు..



విచారణ చేపడుతున్న అధికారులు

స్పందన ఫిర్యాదులపై విచారణ

ప్రజాశక్తి-కోటవురట్ల:స్పందన ఫిర్యాదుల సమస్యల పరిష్కారంలో భాగంగా తహసిల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు ఫిర్యాదుదారులతో విచారణను శనివారం చేపట్టారు. ఎండపల్లి గ్రామానికి చెందిన గొర్లి సీత, పాడిశెట్టి వరహాలమ్మ, గుడివాడ సత్యవతి జగనన్న కాలనీలకు ఇళ్ళ పట్టాలు ఇచ్చారని, స్థలం చూపలేదని స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిర్యాదుదారులతో అధికారులు మాట్లాడారు. ఇళ్ల పట్టాలు ఇచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా గ్రామంలో స్థానిక నాయకులు స్థలం కేటాయింపును అడ్డుకుంటున్నారని అధికారుల ముందు ఫిర్యాదు దారులు వాపోయారు. సమస్య పరిష్కరించేందుకు పిర్యాదారులకు భరోసా ఇచ్చారు. మండలంలో పలు రెవెన్యూ, గ్రామ కంఠం సమస్యలకు అధికారులు పరిష్కార మార్గం చూపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జానకమ్మ, మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ, స్థానిక ఎస్సై నారాయణరావు, ఈఓపిఆర్‌డి ప్రేమ్ సాగర్, హౌసింగ్ జగదీశ్వరరావు, మండల సర్వేయర్ వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

అధికారులు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:సమస్యల పరిష్కారానికి నిరంతరం అధికారులు అందుబాటులో ఉండాలని మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ సూచించారు. శనివారం ఆమె మండలంలోని జగ్గంపేట గ్రామంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీని పరిశీలించారు. అనంతరం మండల సమావేశం మందిరంలో అధికారులతో సమావేశమై పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా జగనన్న కాలనీ ఇల్లు నిర్మాణాలను అధికారులు వేగవంతం చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, పారిశుధ్యం పట్ల దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, పిఆర్ జేఈఈ వర్మ, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

29న బైక్ ర్యాలీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: వైసిపి పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 29న జరుగుతున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంఖర్ గణేష్ కోరారు. శనివారం పెద్ద బొడ్డేపల్లి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టీడీపీ దుర్మార్గపు వైఖరిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా నర్సీపట్నంలో ఈనెల 29న ఉదయం 10 గంటలకు సిబిఎం కాంపౌండ్ నుండి సిఎంఆర్ షాపింగ్ మాల్ వరకు బైక్ ర్యాలీ జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ ఇల్లు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించి విజయవంతంగా నిర్మించి అందిస్తోందని, టీడీపీ అధినేత పేదల ఇళ్లను, స్థలాలను శ్మశాన వాటికలతో పోల్చి లబ్ధిదారులను దారుణంగా అగౌరవపరిచారన్నారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ ముఖ్య నాయకులు, అభిమానులు, కార్యకర్తలు జయప్రదం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

ఎన్‌టిఆర్‌కు ఘన నివాళి



. కూలీలకు ఆహార పొట్లాలు అందజేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని వేంపాడు గ్రామంలో శనివారం టిడిపి నేతలు పల్లా రాంబాబు, కమ్మిళ శివరామకృష్ణన్ రాజు, అయినంపూడి అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యులు కుంచే మధు ఆధ్వర్యంలో నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంధర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు కుంచే మధు మాట్లాడుతూ, ఎన్.టి.ఆర్ బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. అనంతరం ఉపాధి హామీ కూలీలకు ఆహార పొట్లాలు, మజ్జిగ, శీతల పానీయాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కల్లెపల్లి వరహాలరాజు(బుజ్జి), దేనుముకొండ సూరిబాబు రాజు, అయినంపూడి రవి, కల్లెపల్లి అప్పలరాజు, పిట్టా శ్రీను, పల్లా నాగరాజు కమిడి వెంకట రమణ(శ్రీను), గుడాల దావీదు, ఇసరపు పాపారావు, యాదగిరి నూకరాజు, పిట్టా నాగేశ్వరరావు, కరక శివ, చందనాడ కొండయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.




సహాయం అందిస్తున్న అప్పలనాయుడు

అప్పలనాయుడు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలోని ఎం.కోడూరు గ్రామంలో నిర్మాణం అవుతున్న పసలమ్మ తల్లి ఆలయానికి వైసిపి గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు పడాల అప్పలనాయుడు రూ.5000 విరాళం అందించారు. ఆయన జన్మదినం సందర్భంగా అందజేశారు. అనంతరం ఇటీవల వడ దెబ్బతో మరణించిన తాపీ మేస్త్రి సొడే అప్పారావు కుటుంబానికి 50 కిలోల బియ్యం, వెయ్యి రూపాయల నగదు అందించారు. ఈ కార్యక్రమంలో పోతిన జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయంపూడిలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-నక్కపల్లి:ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం ను రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సీతారామరాజు కోరారు. మండలంలోని న్యాయం పూడి గ్రామంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రాం ను సందర్శించారు. వైద్యులు పలువురు రోగులను పరీక్షించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు మందులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపి ఆర్ డి వెంకటనారాయణ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



సందర్శిస్తున్న ఎంపీడీవో

విద్యార్థులకు బహుముఖ పోటీలు



కోటవురట్లలో అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి

ప్రజాశక్తి-నక్కపల్లి :ఆటలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని గ్రంథాలయ అధికారి జనార్ధన్ అన్నారు. మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం చిన్నారులతో ఆటలు ఆడించారు. వైకుంఠ పాళీ ఆటలో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అప్పలరాజు, సిబ్బంది రమణమ్మ పాల్గొన్నారు.

కోటవురట్ల:వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా శనివారం శాఖ గ్రంథాలయంలో గ్రంథాల అధికారి అప్పలనాయుడు విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. పుస్తకాలు చదవడం, మంచి మంచి కథలు వినడం, చెప్పడం నేర్చుకోవాలన్నారు.

నర్సీపట్నం టౌన్: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి లైబ్రేరియన్ దమయంతి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వీరేశలింగం పంతులు గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. గోలుగొండ మండలం కె. ఏల్లవరం జిల్లా పరిషత్ స్కూల్ ఇంగ్లీష్ టీచర్ కనకరాజు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగి భవాని, ఉపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి, సిఆర్ పి మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.
పోటీలు నిర్వహిస్తున్న దశ్యం ఫోటో.

కె.కోటపాడు: మండలంలోని చౌడువాడ శాఖా గ్రంథాలయంలో శనివారం వేసవిజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయాలు-వాటి ఉపయోగాలు అన్న అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి మడ్డు పద్మావతి పాల్గొన్నారు.

ములగాడ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ఎదగాలని 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ అన్నారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో బాలలకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 61వ వార్డు వైసిపి అధ్యక్షులు డిపో సత్యనారాయణ మాట్లాడారు.ప్రముఖ రచయిత కె.సత్తిరాజు, కె.రాధ, సిహెచ్‌వి. సత్యనారాయణ, సిహెచ్.నూకరాజు, బి.అప్పల నాయుడు, పి.స్వప్న, వీర్రాజు, నారాయణ, సతీష్, కార్మిక నాయకులు బి.సత్యానందం, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పెందుర్తి : పెందుర్తి శాఖ గ్రంథాలయంలో 20వ రోజు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించారు. టంగుటూరి ప్రకాశం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శిబిరంలో విద్యార్థులు కథలు రాశారు. చదివారు. గ్రంథాలయాధికారి సూర్యకళ మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధి ఎల్ఎస్ఎన్.మూర్తి, రామకృష్ణ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి - కలెక్టర్ రవి సుభాష్

ప్రజాశక్తి- రావికమతం: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హత గల ప్రజలందరికీ అందే విధంగా సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ పటాన్ శెట్టి రవి సుభాష్ అధికారులను ఆదేశించారు. రావికమతం మండలం మేడివాడ గ్రామంలో శనివారం సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా జగనన్న కాలనీలో చేపడుతున్న గృహ నిర్మాణపు పనులను క్షేత్రస్థాయిలో పర్యటించి వీలైనంత తొందరలో పూర్తి చేయాలని సంబంధిత గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. కాలనీలో మౌలిక సదుపాయాలను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టిక ఆహారంపై అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల నిర్వహణపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు.ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అంతరం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించారు.



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

ప్లేగ్రౌండ్, టాయిలెట్స్, తరగతి గదులను పరిశీలించారు.

రావికమతం మెయిన్ రోడ్డును ఆనుకొని ఉన్న ఆక్రమణలు తొలగించిన నేపథ్యంలో కల్వర్టుల నిర్మాణంకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని, చీమలపాడు పంచాయతీ చలిసింగం గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడానికి వీలైనంత పెద్ద మొత్తంలో నిధులను మంజూరు చేయాలని ఎంపీపీ పైలరాజు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.

లబ్ధిదారుల మొర

రావికమతంలో జగనన్న కాలనీలో రోడ్లు, విద్యుత్తు, మంచినీటి సదుపాయం, తదితర మౌలిక సదుపాయాలు లేకపోవడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఈ విషయమై పలుమార్లు మండల స్థాయి అధికారులు దృష్టికి తీసుకువెళ్లిన కనీస స్పందన లేదని కాలనీ లబ్ధిదారులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన కలెక్టర్ జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కాలనీని సందర్శించి మౌలిక సదుపాయాలన్ని గుర్తించి వీడియో తీసి తమకు పంపించాలని తెలిపారు. తక్షణమే పనులను చేపట్టి పూర్తి చేయాలని హెచ్చరించారు. మండల కేంద్రంలోనే ఇటువంటి పరిస్థితి నెలకొంటే మిగిలిన మారుమూల గ్రామాల పరిస్థితి ఏమిటని అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఉమామహేశ్వరరావు, ఎంపిడిఓ వెంకన్నబాబు, పిఓపిఆర్డి రమణమూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



తలకిందులుగా నిరసన చేపడుతున్న మత్స్యకారులు

మత్స్యకారుల నిరసన

ప్రజాశక్తి-నక్కపల్లి: హెటిరో డ్రగ్స్ కంపెనీ కొత్త పైపు లైన్ వేసుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన అనుమతులు వెంటనే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మత్స్యకారులు డిమాండ్ చేశారు. పైపులైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా శనివారం 542వ రోజుకు చేరింది. మత్స్యకారులు తలక్రిందులుగా నిలబడి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, ఇప్పటికే వేసిన పైపు లైన్‌తో మత్స్యకారులు ఉపాధి కోల్పోయి వలసలు పోతుంటే, రెండో అతి పెద్ద పైపులైను వేస్తే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. మత్స్యకారుల ఉపాధిని దెబ్బ తీసి, వారి జీవితాలను నాశనం చేయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మామిడి నానాజీ, గోసల స్వామి, చేపలు సోమేష్, వాసుపల్లి అప్పారావు, బొంది నూకరాజు, మైలపల్లి దాదాజు, కొత్వాల్ కాశీ, వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు, గ్రామస్తులు

సుందరయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-నక్కపల్లి: కమ్యూనిస్టు నేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శనీయమని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు కొనియాడారు. మండలంలోని గునుపూడి లో శుక్రవారం రాత్రి సుందరయ్య 38వ వర్ధంతి పురస్కరించుకొని గ్రామ ప్రజల సమక్షంలో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అప్పలరాజు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు ఎం.రాజేష్‌లు మాట్లాడుతూ, కామ్రేడ్ సుందరయ్య వీర తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం ద్వారా 10 లక్షల ఎకరాల భూములు పంపిణీ చేశారని తెలిపారు.

సైకిల్ పై పార్లమెంటు కు వెళ్లి అతి సామాన్యమైన జీవితాన్ని గడిపిన ఆదర్శ నేత సుందరయ్య అని కొనియాడారు. సమాజంలో అసమానతలు రూపు మాపమాలని పోరాటం చేసిన ఆదర్శ వంతుడని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు భరినికల రాము, యాదగిరి నవీన్, రాయుడు కనకేశ్వరరావు, పిల్లి తాతారావు,వాతాడ అప్పారావు, రాయుడు దండు బాబు,మాసా యేసు బాబు,మనబాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇక నిత్య పూజలు

ప్రజాశక్తి-మాడుగుల: ప్రసిద్ధి చెందిన పురాతన మాడుగుల వేణుగోపాల స్వామి ఆలయంలో ఇకపై నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ జాగాని పద్మలీల, కార్యనిర్వహణ అధికారి తెలిపారు.ఈ సందర్భంగా ఈనెల 30 న సంప్రోక్షణ, 31న శాంతి హోమం నిర్వహిస్తామని, నిత్యం ధూప,దీప,నైవేద్య కార్యక్రమాలు, నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. వికాస తరంగిణి మహిళల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

నేటి నుంచి ప్రజాశక్తిలో పాఠ్య పుస్తకాల విక్రయం

ప్రజాశక్తి - విశాఖపట్నం : జోన్ 1 పరిధిలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం, అనకాపల్లి, అల్లూరి (పాడేరు, అరకు) జిల్లాలలో 1 నుంచి పదో తరగతి వరకూగల పాఠ్యపుస్తకాలను ప్రజాశక్తి, విశాలాంధ్ర సంస్థలు అమ్మాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఆదివారం నుంచే విక్రయాలు ప్రారంభంకానున్నట్లు ప్రజాశక్తి బుక్ హౌస్ మేనేజర్ బి.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి పుస్తకాలు ఈ నెల 28 నుంచి ప్రజాశక్తి ఆటోనగర్ కార్యాలయంలో హోల్‌సేల్ డీలర్లకు, సోమవారం నుంచి అల్లూరి విజ్ఞాన కేంద్రంలోగల ప్రజాశక్తి బుక్ హౌస్‌లో రిటైల్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. పై జిల్లాలలో బుక్స్ కావాల్సిన వారు 9490099061/133 నెంబర్లను సంప్రదించి ఆర్డరు పెట్టాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని స్కూల్ యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ వార్షికోత్సవ ఆఫర్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ తమ 26వ వార్షికోత్సవం సందర్భంగా వినియోగదారులకు ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటించింది. తమ ఉత్పత్తులను కొనుగోలు చేసిన ప్రతి వినియోగదారునికీ ప్రతి రోజూ, వారంతంలోనూ లక్కీ డ్రా తీసి విజేతలకు ఎల్‌జి ఉత్పత్తులను బహుమతిగా ఇవ్వనున్నట్లు సంస్థ రీజినల్ మేనేజర్ కృష్ణ, బ్రాంచ్ మేనేజర్ యుగంధర్ తెలిపారు. ఈ వేడుకలు జూన్ 30 వరకూ ఉంటాయన్నారు.

రెవెన్యూ అధికారుల తీరుపై నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెనూ అధికారులు బ్రిటిష్ అధికారులను తలపిస్తున్నారని బహుజన ఐక్యవేదిక నాయకులు విమర్శించారు. శనివారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు స్థానిక తహసిల్దార్ కార్యాలయం బ్రిటిష్ కాలం నాటి కట్టడము మాత్రమే కాదని, పౌరుల అర్జీల పట్ల అక్కడి అధికారుల వైఖరి కూడా ఆ నాటి అధికారులను తలపిస్తోందన్నారు. గత మూడు నెలలుగా పెండింగ్ లో ఉన్న ఫైల్ నిమిత్తం డిప్యూటీ తహసిల్దార్‌ను కలవడం జరిగిందని, కాలం గడుస్తున్నా పనులు జరగక పోవడానికి గల కారణాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఒక పని ఎన్ని రోజుల్లోగా పూర్తి చేయాల్సి ఉందో కూడా తెలుసుకునే హక్కు సాధారణ అర్జీదారులకు కూడా ఉందన్నారు.అర్జీదారులు కాళ్ల



నినాదాలు చేస్తున్న బహుజన ఐక్య వేదిక నేతలు

అరిగేటట్లు మండల కార్యాలయానికి తిరగాల్సి వస్తుందన్నారు. ఈ విషయమై ఇంచార్జ్ తహసిల్దార్ హన్నాజిరావు కు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గంగాధర, నాగరాజు, అప్పారావు, నాని, మెలిపాక శివ తదితరులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాల తొలగింపు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి జోన్ త్రీ పరిధి 22వ వార్డులో అనధికారికంగా నిర్మించిన అంతస్తును తొలగించినట్లు పట్టణ ప్రణాళికాధికారి అనిత తెలిపారు. భవన నిర్మాణ వ్యర్థాలను రోడ్డుపై వేయకుండా నిర్మాణదారులు తగిన జాగ్రత్తలు వహించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

ఉప ముఖ్యమంత్రి బూడి

ప్రజాశక్తి-మాడుగుల: గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, ఇప్పటికే నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు తెలిపారు. శనివారం మండలంలోని కేజే పురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో రహదారులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి బాలలతో ముచ్చటించారు .కేంద్రంలో మెనూ సరఫరాపై ప్రశ్నించారు. గ్రామంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి తక్షణం చొరవ చూపాలని అధికారులకు సూచించారు. వాలంటీర్ల పనితీరుపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ళ అమ్మ తల్లి నాయుడు బూడిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెదబాబు, వైస్ ఎంపీపీలు రాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, ఎంపీడీవో మీనా కుమారి తదితరులు పాల్గొన్నారు.



బూడిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్

47వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 47వ వార్డు పరిధి సంజీవయ్య కాలనీ-1 ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరితో కలిసి శనివారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లులా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో 47వ వార్డు నాయకులు వసంతల అప్పారావు, సుకుమార్, గార కృప, రాఘవులు, గురువోజీ, డిల్లీ ఈశ్వరరావు, అనిత పాల్గొన్నారు.